క్లుప్తంగా

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి



విశేష పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, దాతలు

అగనంపూడి: ఆలయ నిర్మాణానికి దాతల సహకారం అవసరమని అగనంపూడి షిర్డి సాయి మందిర కమిటీ చైర్మన్ కె.రమణారెడ్డి అన్నారు. మందిర నిర్మాణం, ఆలయంలో అన్న సమారాధనకు లంకెలపాలేనికి చెందిన జంపా అప్పలరాజు, జానకీలక్ష్మి, బొండపల్లి విష్ణుసాయివంశీ, హరిశ్రీ దంపతులు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో అప్పలరాజు దంపతుల సహకారాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. తరువాత విష్ణు సహస్ర పారాయణం, సాయి చాలీసా, హనుమాన్ చాలీసా, గురుపాదుకా స్తోత్రం, లింగాష్టకం, భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు దర్మాల వ్యాసశర్మ, పీఎల్ఎస్ రాజు, పి.గోవిందరావు, సత్యలక్ష్మి, పంకజం, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షునికి అభినందన



గొందేశి మహేశ్వరరెడ్డికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఐఎన్‌టీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమితులైన గొందేశి మహేశ్వరరెడ్డిని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం అభినందించారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ ఆలిండియా అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి పంపించిన నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, కారు రమణ, చిత్రాడ రమణ, గొందేశి సుమన్ రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

గాజువాక: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజక వర్గం ఎన్నికల కోసం గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి బీఎల్వోలు, సిబ్బందికి సూచనలు చేశారు. బూత్‌లో ఏర్పాటు చేయాల్సిన ఎలక్షన్ మెటీరియల్ సర్దుబాటుపై ఆరా తీశారు. గాజువాక నియోజకవర్గంలో ఎన్ని బూత్‌లు ఏర్పాటు చేయాలన్న దానిపై కసరత్తు దాదాపు పూర్తయిందని, త్వరలోనే స్పష్టత వస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు అధికారులున్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఆర్కే పురంలో స్థానిక భవానీ భక్తులు ఏర్పాటు చేసిన దుర్గాదేవి పీఠం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ కొణతాల సుధ అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం భక్తులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆమె ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ యువత దైవ భక్తితోపాటు సామాజిక సేవలో ముందుండేలా చొరవ తీసుకోవాలన్నారు. మహిళలను దుర్గ స్వరూపాలుగా భావించి, వారి పట్ల గౌరవంగా మసలువాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

సాయి దివ్య రూపం.. జ్ఞాన కాంతి దీపం

- దత్తసాయి ఆలయ వార్షికోత్సవం నేడు
- రోజంతా ప్రత్యేక పూజలు, హోమాలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి శాతవాహననగర్‌లోని శ్రీ షిర్డి సాయి ఆలయం 18వ వార్షికోత్సవానికి ముస్తాబయింది. వేలాదిగా తరలి వచ్చే భక్తులకు మూడు పూటలా ప్రసాద వితరణ, రెండు పూటలా అన్న సమారాధన ఇక్కడ ప్రత్యేకత. గత 17 సంవత్సరాలుగా నిత్య పూజలు అందుకుంటున్న శ్రీ దత్త సాయి ఆలయ వార్షికోత్సవానికి గాజువాక పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చే వేలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రతి రోజూ పండగే

శాతవాహననగర్‌లోని విశాలమైన రావులచెరువు ఒడ్డున ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో నూతన సంవత్సర వేడుకలు, మహాశివరాత్రి, ఉగాది, శ్రీరామనవమి, గణపతి నవరాత్రులు, శ్రీదత్త జయంతి, గురుపౌర్ణమి, దేవీ నవరాత్రులు, కార్తీకమాసం నెలరోజులూ విశేష పూజలు, వార్షిక నవరాత్రులు, సంక్రాంతి పర్వదినాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ఏడాది పొడవునా ఉత్సవ వాతావరణమే. పండగ రోజుల్లో మరింత సందడి. ఆయా పర్వదినాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.

వార్షికోత్సవ కార్యక్రమాలు

ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సాయినాథుని స్మరిస్తూ ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి అంటూ 24 గంటలపాటు వివిధ భజన బృందాలతో ప్రత్యేక భజనలు, పూజలు, సప్తాహాలు నిర్వహించనున్నారు. చండీపారాయణం, శ్రీచక్రార్చన, 111 కలశాలతో క్షీరాభిషేకం, బంగారు, వెండి పుష్పాలతో అర్చనలు చేయనున్నారు. స్వామి వారిని ఉదయం, సాయంత్రం భజన బృందాలు ముందుండి కీర్తించగా.. వెండి పల్లకిపై ఊరేగిస్తారు. భారీ అన్నసమారాధనలు నిర్వహిస్తారు.



శాతవాహననగర్‌లో కొలువైన షిర్డీసాయి



ఆలయంలో సాయిబాబా మైనపు విగ్రహం

షిర్డీ మాదిరిగా చందనోత్సవాలు

షిర్డీలో జరిగే విధంగా హిందూ ముస్లింలు కలసి జెండా ఉత్సవం, చందనోత్సవం ఘనంగా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ప్రధానార్చకులు శ్రీధరస్వామి శిష్య బృందం పర్యవేక్షణలో ప్రతి సోమవారం శ్రీదత్తాత్రేయునికి, మంగళవారం, శనివారం సింధూర అభయాంజనేయ స్వామికి, బుధవారం శ్రీలక్ష్మీ గణపతికి, గురువారం షిర్డిసాయికి, శనివారం శ్రీకృష్ణభగవానుడికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, గరిక, తులసీ పూజలు, విశిష్ట హోమాలు, భగవద్గీత, లలితా సహస్రనామ పారాయణం, సుందరకాండ పారాయణం కడు రమ్యంగా జరుగుతాయి. ఈ కార్యక్రమాలను దత్తసాయి మందిర కమిటీ పర్యవేక్షిస్తుంది.



వార్షికోత్సవం సందర్భంగా హోమానికి ఏర్పాట్లు

పూర్వ జన్మ సుకృతం

సాయినాథునికి సేవ చేసే అదృష్టం దొరకడం నిజంగా నా పూర్వజన్మ సుకృతం. ఈ ఆలయంలో జెండా పండగ, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, ముస్లిం హిందువులు కలిసి స్వామి వారిని గుర్రాలు, ఒంటెలతో ఊరేగిస్తూ నిర్వహించే చందనోత్సవాన్ని చూడడానికి రెండు కళ్లు చాలవు. వార్షికోత్సవంలో భాగంగా రోజంతా పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు జరుగుతాయి.

-శ్రీధర స్వామి, ప్రధానార్చకులు

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు రెండు ప్రాజెక్టులు



సోలార్ సిటీ ప్రాజెక్ట్‌తో యారాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు



నడుపూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్

పెదగంట్యాడ: రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మండలంలోని రెండు పాఠశాలలకు చెందిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. యారాడ జెడ్పీ హైస్కూల్ గైడ్ టీచర్ ఈఎం మోహనరావు నేతృత్వంలో ఎస్.శ్రీవల్లి రూపొందించిన సోలార్ సిటీ ప్రాజెక్ట్ మండల, జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి ఇప్పుడు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిమితమైన శక్తి వనరులను వినియోగించుకుంటూ వెళ్తే అవి వాతావరణాన్ని కలుషితం చేయడంతో పాటు భావి తరాలకు అందుబాటులో లేకుండా పోతాయన్నారు. అందువల్ల అపరిమితమైన సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చుకుని గృహ, వ్యవసాయ, వాహనాలు నడిపేందుకు వినియోగిస్తే ఖర్చు తగ్గడంతో పాటు వాతావరణానికి మేలు చేసినవారిమవుతామన్నారు. ఈ నెల 14, 15 తేదీలలో జిల్లా స్థాయిలో జరిగిన ప్రదర్శనలో ఈ ప్రాజెక్ట్‌ను తమ పాఠశాల విద్యార్థినులు శ్రీవల్లి, ఎస్.యామిని ప్రదర్శించి ఈ నెల 28న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వెల్లడించారు.

వినూత్నంగా ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్

నడుపూరు జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు రూపొందించిన ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. పాడైన మొబైల్స్‌ను సీసీ కెమేరాలుగా వినియోగించుకునేలా ఈ ప్రాజెక్ట్‌ను తయారు చేశారని పేర్కొన్నారు. పాడైన మొబైల్‌ను వైఫై ద్వారా కనెక్ట్ చేసి సీసీ కెమేరా మాదిరి వినియోగించుకోవచ్చన్నారు. మనం వాడుతున్న మొబైల్ ద్వారా పాత మొబైల్‌కు అనుసంధానం చేసి రికార్డ్ చేయవచ్చన్నారు. దేశంలో వృథాగా అవుతున్న రెండు మిలియన్ టన్నుల ఈ వేస్ట్‌ను కొంతమేర మళ్లీ వినియోగించుకోవచ్చని ఈ ప్రాజెక్ట్ ద్వారా రుజువు చేశారన్నారు. పనికిరాని మొబైల్స్ ద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ తయారు చేయడంలో భాగస్వాములైన విద్యార్థులు కె.నివాస్, శ్రీచరణ్, సీహెచ్ మనోజ్, నాగేష్‌ను అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు.

అధ్వానంగా దువ్వాడ రైల్వే ప్లాట్‌ఫామ్

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు, కేబుళ్లు



బయటికి వచ్చిన విద్యుత్ వైర్లు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌ల నిర్వాహణ విమర్శలకు దారితీస్తుంది. ప్లాట్‌ఫామ్‌లపై మూడేళ్ల క్రితం టైల్స్ ఏర్పాటు చేశారు. అయితే చాలా చోట్ల టైల్స్ విరిగిపోయి ఊడిపోగా, మరికొన్ని చోట్ల ప్లాట్‌ఫామ్‌పై సిమెంట్, కాంక్రీట్ తేలిపోయి గోతులు ఏర్పడ్డాయి. లగేజీలు, పిల్లలు, వృద్ధులతో ప్రయాణం చేసేవారు గోతుల్లో అడుగులు వేసి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై విద్యుత్ వైర్లు, కేబుళ్లు బైటకు వేలాడేలా ఉండడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. రైల్వే అధికారులు స్పందించి నిర్వాహణపై శ్రద్ధ చూపాలని వారు కోరుతున్నారు.



పెచ్చులూడిన ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్

రోడ్డు విస్తరించారు.. కల్వర్టు వదిలేశారు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సెక్టార్-1 నుంచి ఉప్పరకాలనీ మధ్యలో ఉన్న ప్రధాన రహదారిలో కల్వర్టు వద్ద విస్తరణ జరగక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రెండు మండలాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి. దీంతో నాలుగేళ్ల క్రితం ఈ రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. 24 అడుగుల రోడ్డును 40 అడుగులకు విస్తరించారు. ఆ సమయంలో ఉప్పరకాలనీ ఎదురుగా డ్రైనేజీపై కల్వర్టు నిర్మాణం కోసం గోడలు నిర్మించారు. వాస్తవంగా ఈ ప్రాంతంలో రోడ్డు కుదించుకుపోయింది. కల్వర్టు నిర్మాణ పనులు కూడా మధ్యలో వదిలేయడంతో వాహన చోదకులు ఇక్కడికి వచ్చేసరికి అయోమయానికి గురవుతున్నారు. జీవీఎంసీ, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టుపై శ్లాబ్‌లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఉప్పరకాలనీ వద్దనున్న కల్వర్టు

ఘనంగా వెంకాయమ్మ పరస

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడలో గంట్యాడ వెంకాయమ్మ పరసను గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గంట్యాడ గోవిందరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్సీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఉర్రూతలూగించింది. పెదగంట్యాడలోని రేలా రే రేలా కార్యక్రమం ఆకట్టుకుంది. పరస కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



జనంతో కిటకిటలాడుతున్న పరస

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: పెదగంట్యాడ సబ్‌స్టేషన్ 33/11కేవీ పరిధిలో మరమ్మతు పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగంట్యాడ 11కేవీ పరిధిలోని గొడ్డివానిపాలెం, దుర్గవానిపాలెం, నెల్లిముక్కు, సీతానగరం, పెదగంట్యాడ మెయిన్ రోడ్డు, బర్మా కాలనీ, బాబూ జగ్జీవన్‌నగర్, రైతు బజార్ తదితర ప్రాంతాలతో పాటు 11కేవీ ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో ధర్మాల వీధి, ఎస్సీ కాలనీ, అరుణా కాంప్లెక్స్, నీలాపువీధి, ఏపీహెచ్‌బీ కాలనీ, నొవాస్-పోర్టు రోడ్డు, 11కేవీ వుడా ఫీడర్ పరిధిలోని టీఎస్ఆర్ రోడ్డు, సిద్ధేశ్వరం, వెంపల్లనగర్, సమతానగర్, టెలిఫోన్ ఎక్సేంజ్ రోడ్డు, టీజీఆర్ నగర్, 11కేవీ ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలోని పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఏరియా, 11కేవీ గాజువాక ఫీడర్ పరిధిలోని యాతపాలెం, దిబ్బపాలెం కాలనీ, అశోక్‌నగర్, ప్రియదర్శినీ కాలనీ, 11కేవీ దిబ్బపాలెం ఫీడర్ పరిధిలోని గొడ్డువానిపాలెం, కండిపిల్లి వారి వీధి, గంగవరం, యాతపాలెం కాలనీ, వెంకన్నపాలెం, సత్యనారాయణపురం, 11కేవీ బీసీఎల్ ఫీడర్ పరిధిలోని నేతాజీ కాలనీ, దయాల్‌నగర్, టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తప్పదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూర్మన్నపాలెం: గాజువాక, వడ్లపూడి విద్యుత్ సబ్ స్టేషన్లలోని 33/11 కేవీ ఫీడర్లకు జంగిల్ క్లియరెన్స్, ఇతర నిర్వహణ పనులను చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా శివాజీనగర్, కూర్మన్నపాలెం, ప్రశాంతి నగర్, శాతవాహననగర్ తదితర ప్రాంతాల్లోని ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ప్రజలు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

శ్రీకృష్ణదేవరాయల పాలన స్వర్ణయుగం

ఘనంగా దేవరాయల 552వ జయంతి

గాజువాక: శ్రీకృష్ణ దేవరాయలకు గాజువాక ప్రాంత కాపు సంఘాల నాయకులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. దేవరాయలు 552వ జయంతి సందర్భంగా జగ్గు జంక్షన్‌లో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కృష్ణదేవరాయల పాలనను కొనియాడారు.

- శ్రీకృష్ణదేవరాయ గాజువాక కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య మాట్లాడుతూ దేవరాయల పాలన ఒక సువర్ణయుగమని కీర్తించారు. కార్యక్రమంలో 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, సియ్యాద్రి సత్యారావు, కట్టా అప్పారావు, తాటికొండ కాశి పాల్గొన్నారు.
- శ్రీకృష్ణ దేవరాయ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో కాపు నాయకులు దేవరాయల విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, గుడివాడ అమ్మన్న, జగదీష్, అన్నవరం, కర్రి నాగేశ్వరరావు, ప్రభాకరరావు, ఇందల ఈశ్వరరావు, మహలక్ష్మి నాయుడు, గంధం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



దేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి తదితరులు

విభజన హామీలను విస్మరించిన కేంద్రం

ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక

కూర్మన్నపాలెం: ఆంధ్రప్రదేశ్‌కు దశాబ్దాలుగా పదే పదే అన్యాయం జరుగుతూనే ఉందని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక దండి ఆరోపించారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు 735వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో దీక్షకు మద్దతుగా ఓబీసీ సంఘం అధ్యక్షుడు అప్పారావు, జనరల్ సెక్రటరీ ముసిరి శ్రీను, ట్రెజరర్ యు.శ్రీను, పండూరి కుమారితో పాటు ప్రియాంక హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, గంధం వెంకటరావు, కారు రమణ, జి గణపతిరెడ్డి, గుమ్మడి నరేంద్ర పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు. అనంతరం ప్రియాంక మాట్లాడుతూ విభజన హామీలను విస్మరించి రాష్ట్రంలో అతిపెద్ద పరిశ్రమగా ఎదిగిన విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమల్ని సర్వనాశనం చేయడానికే కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆక్షేపించారు. ఈ ప్రయత్నాలను సంస్థలోని కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కోవాలని సూచించారు. దేశంలోని సంపదను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టే హక్కు కేంద్రానికి లేదన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఉద్యమంలో కార్మికులతో పాటు ప్రజలందరినీ భాగస్వాముల్ని చేస్తూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.రాజబాబు, జి.ఆర్.కె.నాయుడు, చిత్రాడ సన్యాసిరావు, కార్మికులు పాల్గొన్నారు.



735వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ ప్రియాంక

అథ్లెటిక్స్ విజేతలకు అభినందన

పెదగంట్యాడ: ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మిడ్నాపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో పారిశ్రామిక క్రీడాకారులు సత్తా చాటారు. జావెలిన్ త్రో, హేమత్ త్రో, షాట్‌పుట్, 5 వేల మీటర్లు, ఐదో కిలోమీటర్ల రేస్ వాక్‌లో విజేతలుగా నిలిచి పతకాలు సాధించారు. ఏపీఈపీడీసీఎల్‌లో పని చేస్తున్న జీవీఎంసీ 77వ వార్డు పరిధి పెదపాలేనికి చెందిన అన్సర్ వలీ, స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తున్న కాను కుమార్ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. విజేతలను అసోసియేషన్ అధ్యక్షుడు మంగ వరప్రసాద్, ఏపీఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.



అన్సర్ వలీని అభినందిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు

బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

గాజువాక : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బీజేపీ ప్రచార కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర 70వ వార్డులోని వర్షిణి కల్యాణ మండపంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అభ్యర్థి పీవీఎన్ మాధవ్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కో ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి దీనంకొండ కృష్ణంరాజు, నాయకులు సిరసపల్లి నూకరాజు, పొలిమేర శ్రీను, శశిధరణ్ పిళ్లై, బొండా ఎల్లాజీరావు, రోహిణి, వర్రి లలిత, పావని, అప్పలరాజు, శ్రీదేవి, కట్టా పద్మ, భువనేశ్వరి, తూట చంద్రశేఖర్, శ్రీరామ్మూర్తి, నాగేశ్వరరావు, ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేడపాటి రవీంద్ర తదితరులు

కరాటే విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం



కరాటే క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

గాజువాక: ఇటీవల విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన గాజువాక ప్రాంత క్రీడాకారులకు కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి స్థానాన్ని భారత్ సొంతం చేసుకున్న ఈ పోటీల్లో విశాఖ, గాజువాక క్రీడాకారులు అద్భుత ప్రతిభ ప్రదర్శించారని కొనియాడారు. గాజువాక నుంచి హాజరైన పది మంది క్రీడాకారులలో ఆరుగురు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిజీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్, కోచ్‌లు సాయి, కమల్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం

సింధియా: కార్మికుల సమస్యలపై ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడుతూనే ఉంటుందని హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీరామమూర్తి అన్నారు. షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు పి.కె.వి.రమణ అధ్యక్షతన గురువారం నెలవారీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్మికుల సమస్యలపై చర్చించిన సంఘ ప్రతినిధులు నూతనంగా సంఘంలో చేరిన కార్మికులకు కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఉంటూ న్యాయం జరిగే వరకు ఐఎన్‌టీయూసీ శ్రమిస్తూనే ఉంటుందన్నారు. ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను పర్మినెంట్ చేసే విషయంలో ఐఎన్‌టీయూసీ ప్రయత్నాలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాక్ పోలింగ్‌తో ఎన్నికలపై అవగాహన

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. సాధారణ ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ ఓటర్ల నమోదు, నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ, ఓటింగ్, కౌంటింగ్, విజేతలను ప్రకటించడం వంటి ప్రక్రియలను విద్యార్థులకు అర్థమయ్యేలా జరిపారు. పాఠశాల హెచ్ఎం ఎస్తేర్ హెప్సిబా ఆధ్వర్యంలో సోషల్ ఉపాధ్యాయిని కోమలి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ మాక్ పోలింగ్ వల్ల భారత దేశ ఎన్నికల ప్రక్రియపై విద్యార్థుల్లో అవగాహన వస్తుందని హెచ్ఎం హెప్సిబా అన్నారు.



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న హెచ్ఎం హెప్సిబా, ఉపాధ్యాయులు

భగవద్గీతతో జ్ఞాన యోగం

పరవాడ: భగవద్గీత ద్వారా కర్మ విధానం తెలుసుకుని జనన మరణ చక్రం నుంచి బయట పడాలని త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక- ప్రబోధ సేవా సమితి అనకాపల్లి కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ సూచించారు. పరవాడలో గురువారం హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో కమిటీ సభ్యులు ఇంటింట గ్రంథ పరిచయం చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలు చదివి స్వామి వారి ప్రసంగాలు వినడం ద్వారా జ్ఞానులుగా మారవచ్చని శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మణి, దేవి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఘనంగా క్రీడా దినోత్సవం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో సీఐ భాస్కరరావు, స్కూల్ సిబ్బంది

గాజువాక: స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్లో గురువారం క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆట, పాటలలో కూడా ముందుండాలన్నారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతోపాటు, మెదడు చురుగ్గా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం సురేష్, ఆర్ఐ రమణ, పాఠశాల ప్రిన్సిపాల్ కామాక్షి, ఎ.అరుణ కుమారి, ఇన్‌చార్జిలు విజయలక్ష్మి, మీనాక్షి, రాధిక, ఏవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.